క్లుప్తంగా

వాహనాల తనిఖీ



గోవిందరావుపేట: మండల పరిధిలోని పస్రా ప్రధాన సెంటర్‌లో పస్రా ఎస్సై కమలాకర్ మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులను ఆపి డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, ట్రాఫిక్ నిబంధనలు పాటించకున్నా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం



గోవిందరావుపేట: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా కోశాధికారిగా మండలంలోని చల్వాయి గ్రామానికి చెందిన దర్శనాల సంజీవ్‌ను నియమించినట్లు రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంజీవ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి, తెలంగాణ ఉద్యమంలో తన కష్టాన్ని గుర్తించి జిల్లా కోశాధికారి బాధ్యతలు అప్పగించినందుకు చైర్మన్ చీమ శ్రీనివాస్‌కు, జిల్లా అధ్యక్షుడు మురహరి భిక్షపతికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత



గోవిందరావుపేట: మండల కేంద్రానికి చెందిన జెట్టి రాజు రెండు నెలల క్రితం చల్వాయి నుంచి వస్తుండగా ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈ మేరకు వెంటనే పస్రా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను రికవరీ చేసి మంగళవారం బాధితుడికి ఎస్సై కమలాకర్ అందజేశారు. ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే పోలీస్ స్టేషన్‌లో సంప్రదిస్తే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించవచ్చని ఎస్సై తెలిపారు.

విద్యార్థికి అభినందన



వెంకటాపురం(ఎం): జిల్లాలోని జాకారంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ఐ అండర్-17 కబడ్డీ విభాగంలో మండల కేంద్రంలోని వేదవ్యాస ఉన్నత పాఠశాలకు చెందిన తనుగుల రామ్‌చరణ్ ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పోశాల వీరమల్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి రామ్‌చరణ్‌ను పాఠశాల బృందం చింతిరెడ్డి సూర్యప్రకాశ్‌రెడ్డి, పసునూటి రాజయ్య, దగ్గు ప్రభాకర్ రావు, పీఈటీ శ్రీనివాస్ అభినందించారు.

అన్ని రకాల ధాన్యానికి బోనస్ ఇవ్వాలి

ములుగు రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పండించిన అన్ని రకాల వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పోరిక గోవింద్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వరి సాగు చేసిన రైతులు సన్న రకం, దొడ్డు రకం సాగు చేశారని అన్నారు. సన్నరకంలో 33 రకాలకు మాత్రమే ప్రభుత్వం బోనస్ ఇస్తాననడం సరికాదని అన్నారు. అన్ని రకాల ధాన్యానికి ప్రభుత్వం బోనస్ ఇవ్వాలని అన్నారు. లేని పక్షంలో రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

పురుగుల మందు పిచికారీ చేస్తూ రైతు మృతి



లక్ష్మీనారాయణ (ఫైల్)

ఎస్ఎస్‌తాడ్వాయి: పురుగుల మందు పిచికారీ చేస్తూ ఎండ దెబ్బకు గురై ఓ రైతు మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని బయ్యక్కపేట గ్రామానికి చెందిన చందా లక్ష్మినారాయణ(45) పొలంలో పురుగుల మందు పిచికారీ చేస్తుండగా ఎండదెబ్బ తగిలి అస్వస్థతకు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య రాఘవేంద్రమ్మ ఉంది. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

'ఆయుష్మాన్ భారత్'పై అవగాహన



ములుగు: మోదీ సందేశాన్ని వింటున్న డీఎంహెచ్ఓ కార్యాలయ సిబ్బంది



వెంకటాపురం(కె): అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ములుగు: ధన్వంతరి జయంతి సందర్భంగా 9వ ఆయుర్వేద డేలో భాగంగా జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్ఓ కార్యాలయం ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం అవగాహన కల్పించి హెల్త్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ మేరకు మంగళవారం పీఎం నరేంద్రమోదీ సందేశాన్ని వినడానికి టెలీకాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ విపిన్‌కుమార్, డాక్టర్ పవన్, సంపత్, దుర్గారావు, ప్రవీణ్, కిరణ్, అనిల్‌తతో పాటు 15 పీహెచ్‌సీలు, 89 సబ్ సెంటర్లలో సైతం డాక్టర్లు, సిబ్బంది టెలీకాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.

వాజేడు: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన ఆయుష్మన్ భారత్ కార్యక్రమంపై మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కల్పించారు. వాజేడు వైద్యులు మహేందర్, మధుకర్, గ్యానసలు ఆశ కార్యకర్తలకు సిబ్బందికి ఆయుష్మాన్ భారత్ విధి విధానాలను వివరించారు.



వాజేడు: ఆయుర్వేద వైద్యంపై వివరిస్తున్న వైద్యాధికారులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఎదిర వైద్యశాలలో ఆయుర్వేద దినోత్సవం కార్యక్రమాన్ని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి, ఆశవర్కర్లకు ప్రాచీన ఆయుర్వేద వైద్య విధానంపై అవగాహన కల్పించారు. వైద్యాధికారులు స్నేహ, పవన్, ఆశిష్, వినయ్ ఉన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధికి కృషి



తహసీల్దార్ గిరిబాబును సన్మానిస్తున్న నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి: అందరి సహకారంతో మండలాభివృద్ధికి కృషి చేస్తానని తహసీల్దార్ గిరిబాబు అన్నారు. తాడ్వాయి మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలను స్వీకరించిన గిరిబాబును స్థానిక కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, పార్టీ నాయకులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు తహసీల్దార్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం తహసీల్దార్ గిరిబాబు మాట్లాడుతూ.. మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎండీ ముజఫర్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రేగ కల్యాణి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాక సాంబయ్య, మాజీ సర్పంచ్‌లు ఇర్ప సునీల్ దొర, నరసింహస్వామి, సింగిల్ విండో డైరెక్టర్లు యానాల సిద్ధిరెడ్డి, రంగరబోయిన జగదీశ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, నాయకులు చంద్రయ్య, సూర్యనారయణ, రమేశ్, లక్ష్మయ్య, నారాయణ, రెహమాన్, ప్రశాంత్, నరేష్, చిరంజీవి పాల్గొన్నారు.

మంత్రి కృషితోనే రెవెన్యూ డివిజన్

గోవిందరావుపేట: రాష్ట్ర పంచాయతీ రాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కృషితోనే ఏటూరు నాగారం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అయిందని కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు చింత క్రాంతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించడానికి కృషి చేసిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఏటూరునాగారం మండల ప్రజలు మంత్రి సీతక్కకు రుణపడి ఉంటారని అన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా సీతక్క అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు పేర్కొన్నారు. సమ్మక్క సారక్క గిరిజన యూనివర్సిటీకి భూమిని కేటాయించడం, రైతుల కోసం సన్నవడ్లకు రూ.500 రుపాయలు బోనస్‌ను ప్రకటించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

హానికరమైన మందులతో నాణ్యతా లోపం

- చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి



శిక్షణలో మాట్లాడుతున్న చాంబర్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

వరంగల్ : మిర్చిపంట సాగులో హానికరమైన పురుగు మందుల వాడకం వల్ల నాణ్యతా లోపించే అవకాశాలు ఉన్నాయని వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం లక్ష్మీపురంలోని చాంబర్ కార్యాలయంలో స్పైసెస్ బోర్డ్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ములుగు జిల్లా మంగపేటకు చెందిన ఆదివాసీ ఫార్మ్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్‌కు చెందిన రైతులకు మిర్చి మార్కెట్ లింకేజ్ ప్రోగ్రాంపై శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్చి పంట సాగులో హానికారక పురుగుమందులు వాడకుండా నాణ్యత పెంపుదలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మిర్చి పంటలో మాయిశ్చర్ లేకుండా సరుకు ప్యాకేజింగ్ చేసినట్లయితే నాణ్యత తగ్గకుండా ఉంటుందని తద్వారా అంతర్జాతీయ మార్కెట్‌లో అధిక ధరలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో స్పైసెస్ బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ విజ్ఞష్న, చిల్లీస్ సెక్షన్ అధ్యక్షుడు రాజేష్ డి.కరాణి, చిల్లీస్ సెక్షన్ వ్యాపారులు, ఆదివాసీ ఫార్మ్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో ముందుడాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ గిరిబాబు



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

ఎస్ఎస్‌తాడ్వాయి: బాలికలు చదువుతోపాటు అన్ని రంగాల్లో ముందుడాలని తాడ్వాయి తహసీల్దార్ గిరిబాబు అన్నారు. రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తహసీల్దార్ గిరిబాబు, ఎంపీడీఓ సుమనవాణి హాజరై మాట్లాడారు. అన్ని రంగాల్లో మహిళలు సత్తాచాటుతున్నారన్నారు. ఎలాంటి సమస్యలనైన బాలికలు ఎదుర్కొని లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. స్థానిక ఆశ్రమ బాలికల పాఠశాలలోని విద్యార్థినులతో కలిసి అధికారులు జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ సంస్థ ఎటీఎల్ సంజీవ్‌కుమార్, డాక్టర్ రమేష్, సీఓలు అంజనప్ప, లక్షణమూర్తి, గంగాధర్, ప్రతాప్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటిని ఒడిసి పట్టాలి



మాట్లాడుతున్న మల్లికాదేవి

వెంకటాపురం(ఎం): వర్షపు నీటిని వృథా చేయకుండా భూగర్భ జలాలను భూమిలోకి ఇంకేలా ఒడిసి పట్టుకోవాలని ములుగు భూగర్భ జలశాఖ డిప్యూటీ డైరెక్టర్ మల్లికాదేవి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ మైనార్టీ హాస్టల్‌లో భూగర్భ జల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం భూగర్భ జలాల పెంపుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఇంటి ఆవరణ, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ కళాశాల ప్రిన్సిపల్ వందన, ఎస్సై సతీష్, ఆర్ఎల్‌సీ రమేష్ పాల్గొన్నారు,

మండల కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

వెంకటాపురం(కె): వెంకటాపురం, వాజేడు మండలాల ఎలక్ట్రానిక్ మీడియా మండల కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో వాజేడు, వెంకటాపురం మండలాల ఎలక్ట్రానిక్ మీడియా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడిగా బెతంచర్ల అశోక్, కార్యదర్శిగా అనుముల కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా కె సంతోష్ కుమార్, గుండేటి ఈశోక్, సాయి, సమ్మయ్య, కొప్పుల మహేష్, జక్కుల శ్యామ్, బెతంచర్ల అనిల్, రవి, రారం సాంబశివ రావు, సత్యసాయిలను నియమించారు.

ఓటు హక్కు కల్పించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ములుగు: వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నూతన ఎస్జీటీలకు, ఎస్ఏ (స్కూల్ అసిస్టెంట్)లకు ఓటు హక్కు కల్పించాలని కోరుతూ తహసీల్దార్ విజయభాస్కర్‌కు మంగళవారం ఆ సంఘం బాధ్యులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అన్ని రకాల అర్హతలు ఉన్నా ఉపాధ్యాయులకు ఓట హక్కు లేకపోవడం బాధాకరం అని అన్నారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడు ఎండీ హమీద్, ప్రధానకార్యదర్శి రామ్మూర్తి, జిల్లా బాధ్యుడు సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన కల్పిస్తున్న కిషన్

ములుగు రూరల్: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైఆర్‌జీ కేర్ సంస్థ లింక్ వర్కర్ కిషన్ అన్నారు. మంగళవారం మండలంలోని ఇంచర్లలోని 39వ బెటాలియన్ జవాన్‌లకు తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎయిడ్స్ వ్యాధి నాలుగు రకాలుగా సోకుతుందని అన్నారు. ఎయిడ్స్‌పై ఉన్న అపోహలను వివరించారు. హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులపై వివక్షత చూపకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ కుమార్‌సింగ్, బెటాలియన్ జవాన్లు పాల్గొన్నారు.

అనుమతి తప్పనిసరి

చిట్యాల: మండలంలో ఎవరైనా బాణాసంచాల విక్రయం చేయలనుకుంటే అగ్నిమాపక అధికారి వద్ద నుంచి ధ్రువీకరణ పత్రం, గ్రామ పంచాయతీ నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్సై శ్రామణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాణాసంచా విక్రయదారులు ఇంట్లో కాకుండా బయటనే విక్రయించాలని కోరారు. అలాగే వారి వద్ద తప్పకుండా ఫైర్ సేఫ్టీ కోసం నీరు, ఇసుక, కార్బన్‌డైయాక్సైడ్ వాయువు ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సభ్యత్వ నమోదు చేపడుతున్న నాయకులు

వెంకటాపురం(ఎం): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య జవహర్‌లాల్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని నల్లగుంటలో ఆయుష్మాన్ భారత్, విశ్వకర్మ యోజన తదితర కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలువురి నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టి రానున్న రోజుల్లో తెలంగాణలో పార్టీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీధర్, శరత్, సోనాసింగ్, శివుడు, అశోక్, సంపత్ పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలపై తనిఖీ

కన్నాయిగూడెం: మండలంలోని ఏటూరులో అక్రమంగా మట్టి తరలిస్తున్న ప్రాంతాన్ని మంగళవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గణేశ్ తనిఖీ చేశారు. రెండు రోజుల నుంచి ఏటూరులో ఇసుక రైజింగ్ కాంట్రాక్టర్ ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరుపుతున్నాడనే సమాచారంతో మంగళవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించినట్లు ఆర్ఐ తెలిపారు. అలాగే గోదావరిలో రోడ్డువేసిన ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించి పంచనామా చేసినట్లు పేర్కొన్నారు. పూర్తి నివేదికను తహసీల్దార్ ఇవ్వనున్నట్లు తెలిపారు.



మట్టి తవ్విన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్ఐ గణేశ్

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

మొగుళ్లపల్లి: మండలంలోని పాత ఇస్సిపేట గ్రామానికి చెందిన సూత్రపు రాకేశ్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి రాకేశ్‌తో కలిసి ఇస్సిపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుకున్న స్నేహితులు మంగళవారం రూ.13వేల ఆర్థిక సాయం అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న నాయకులు

మొగుళ్లపల్లి: మండల కేంద్రానికి చెందిన బత్తిని శంకరయ్యగౌడ్, తోడేటి ప్రమీల ఇటీవల అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. కాగా, ఆర్థిక సాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన చెక్కులను మంగళవారం కాంగ్రెస్ నాయకులు వారి ఇంటి వద్దకే వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండీ రఫీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పడిదల ప్రకాశ్‌రావు, మల్సాని రాజేశ్వర్ రావు, ఏలేటి శివారెడ్డి, మోరే జయపాల్ రెడ్డి, బండారి కుమార స్వామి,కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ క్యాతరాజు రమేశ్, నాయకులు చెక్క నరోత్తం, వడ్లకొండ అశోక్, బండారి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు..

గుడుంబాకు బానిస కావొద్దు



పోలీసులు స్వాధీనం చేసుకున్న గుడుంబా

పలిమెల: ప్రజలు గుడుంబాకు బానిస కావొద్దని ఎస్సై తమాషారెడ్డి అన్నారు. మండలంలోని సర్వాయిపేట, పలిమెల గ్రామాల్లో అబ్కారీ శాఖ, పలిమెల పోలీసులు మంగళవారం సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలువురి ఇళ్లల్లో అక్రమంగా దాచి ఉంచిన 200 గుడుంబా పానకం, 40 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని పలువురిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా గుడుంబాను తయారు చేసినా, సరఫరా చేసినా, అమ్మిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనుమానిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించినా, సాయం చేసినా చట్టరీత్యా నేరమని అందుకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సైలు కిష్టయ్య, శిరీషరెడ్డి, కానిస్టేబుళ్లు సీహెచ్ వెంకన్న, ఆర్.వెంకన్న, రమణ, వరుణ్‌రెడ్డి, సివిల్ కానిస్టేబుళ్లు అరుణ్, శ్రావణ్ పాల్గొన్నారు.

కేసు నమోదు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రానికి చెందిన అబ్దుల్ ఖలీక్‌పై ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మంగళవారం మహదేవపూర్ ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. తనను శారీరకంగా వాడుకొని, పెళ్లి పేరు చెప్పగానే చంపుతానని బెదిరిస్తున్నాడని మహిళ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

పరామర్శ

చిట్యాల: మండలంలోని వెంచరామి గ్రామానికి చెందిన కొత్తపల్లి పద్మ, పబ్బ లచ్చమ్మ ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్ మంగళవారం పరామర్శించారు. వారి వెంట నాయకులు కుంభం క్రాంతి కుమార్‌రెడ్డి, కాసు కుమార్, బొమ్మ శరత్, పిట్ట సురేష్, రాజేందర్, దామేర రాజు, గుర్రం సంతు, నర్సయ్య, కుమార్, సురేష్, పోషాలు ఉన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



భూపాలపల్లి అర్బన్: మున్సిపాలిటీ పరిధిలోని ఫక్కీర్‌గడ్డ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పని చేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు మంగళవారం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి సన్మానించారు. పాఠశాలలో పని చేసిన రాచర్ల శ్రీనివాస్, జ్యోతిలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొమ్మ మౌనిక, ఉపాధ్యాయురాలు ప్రేమలత విద్యా కమిటీ సభ్యులతో కలిసి సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల సంఖ్యను పెంచేందు కు వారు చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ప్రమీల, విద్యార్థుల తల్లిదండ్రులు జ్యోతి, మేఘన, పుష్పలత పాల్గొన్నారు.